క్లుప్తంగా

బాల కార్మికులను పనిలో పెట్టుకోవడం నేరం



అవగాహన కల్పిస్తున్న అధికారులు

కార్వేటినగరం: 18 ఏళ్లలోపు ఉన్న బాలబాలికలను పనిలో పెట్టుకుని కార్మికులుగా చేయడం నేరమని ఏఎల్‌ఓ హేమాచారి అన్నారు. గురువారం బాలకార్మికుల వ్యవస్థ నిర్మూలనలో భాగంగా కార్మిక శాఖ అధికారి ఓంకార్‌రావు ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా పోలీస్‌స్టేషన్లలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం దుకాణాలను పరిశీలించారు. ఏఎల్‌ఓ మాట్లాడుతూ బాల కార్మికులను పనిలో పెట్టుకున్నట్లయితే వారిపై కేసు నమోదు చేయడమే కాకుండా రూ.50 వేల జరిమానా విధిస్తామని హెచ్చరించారు. బడిఈడు పిల్లలు బడిలో ఉండే విధంగా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులతో పాటు, ప్రభుత్వ అధికారులపై ఉందన్నారు. పోలీస్ సిబ్బంది, సచివాలయ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం


విజయపురంలో నూతనంగా వేసిన బోరు

విజయపురం: మండల కేంద్రంలో మంత్రి ఆర్కే రోజా ఆదేశాల మేరకు సర్పంచ్ మురళీ రెడ్డి గురువారం తాగునీటి సమస్యను పరిష్కరించారు. గత కొన్ని నెలలుగా మిట్టప్రాంతమైన కొత్తూరు వీధిలో తాగునీరు అందక ప్రజలు తీవ్ర ఇబ్బంది పడ్డారు. విషయం తెలుసుకున్న సర్పంచ్ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి ఆదేశాల మేరకు బోరు వేసి, విద్యుత్ మోటార్ అమర్చి తాగునీరు అందించడంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బాధితులకు ఆర్థిక సాయం


ఆర్థిక సాయాన్ని అందిస్తున్న అప్పలం

పాలసముద్రం: ఆముదాల పంచాయతీ గొల్లకండ్రిగ అగ్నిప్రమాద బాధితులకు ట్రైబల్ వెల్ఫేర్ డిపార్టుమెంట్ మెంబర్ సెక్రటరీ అప్పలం ఆర్థికసాయం అందజేశారు. ఎస్టీ కాలనీలో అగ్నిప్రమాద బాధితులకు కలెక్టర్ సంగిలి షణ్మోహన్ ఆదేశాల మేరకు ఒక్కొక్క కుటుంబానికి రూ.10 వేలు ఆర్థికసాయం అందజేశారు. జిల్లా ఎస్టీ వెల్ఫేర్ అధికారి మూర్తి, సూపరింటెండెంట్ సురేష్, సర్పంచ్ అనురేఖ, ఎంపీటీసీ లిఖిత, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ రంగనాయక్ పాల్గొన్నారు.

అందరూ ఆరోగ్యంగా ఉన్నారు


మల్లారెడ్డికండ్రిగలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

విజయపురం (నగరి): మల్లారెడ్డికండ్రిగలో అందరు ఆరోగ్యంగా ఉన్నారని, జ్వరం, ఒళ్లు, కీళ్ల నొప్పులు తగ్గాయని డాక్టర్ సోమశేఖర్ తెలిపారు. గురువారం ఆయన మల్లారెడ్డికండ్రిగలో ఇది వరకు జ్వరంతో బాధపడిన వారికి మరో సారి వైద్య పరీక్షలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం జ్వరం పూర్తిగా తగ్గిందని, అందరూ ఆరోగ్యంగానే ఉన్నారని తెలిపారు. ఇక భయపడాల్సిన అవసరం లేదని, గ్రామంలో సరఫరా చేసే తాగు నీరు బాగున్నాయన్నారు. రెండు రోజులు గ్రామాల్లో పారిశుద్య పనులు చేపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన


నేత్ర పరీక్షలు చేస్తున్న వైద్యులు

నగరి : పట్టణంలోని ఒక ప్రైవేటు పాఠశాలలో పుష్పాంజలి అయ్యప్ప శబరిమల సేవా సంఘం వారు నిర్వహించిన ఉచిత కంటి, గుండె సంబంధిత పరీక్షల శిబిరానికి విశేష స్పందన లభించింది. గురువారం నిర్వహించిన ఈ శిబిరం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు కొనసాగింది. వంద మందికి ఈసీజీ, 150 మందికి ఎకో పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. కంటి వైద్యపరీక్షలలో 20 మందిని ఆపరేషన్ నిమిత్తం ఎంపిక చేశారు. శబరిమల అయ్యప్ప ఆలయ మేల్‌సాంతి (అర్చకులు) బ్రహ్మశ్రీ పరమేశ్వరన్ నంబూద్రి వైద్యశిబిరానికి విచ్చేసి నిర్వాహకులను ఆశీర్వదించారు. పుష్పాంజలి అయ్యప్ప శబరిమల సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస కదిర్, చిత్తూరు జిల్లా అధ్యక్షుడు గూడువాంజేరి మూర్తి, కౌన్సిలర్లు మోహన్‌రాజ్, మునికృష్ణారెడ్డి, స్థానిక అయ్యప్ప సేవాసంఘం సభ్యులు పాల్గొన్నారు.

నాలుగేళ్లు..నగరికి ఎన్నో మేళ్లు!

- అభివృద్ధికి కోట్ల రూపాయల నిధులు
- నవశకం ప్రారంభమైందంటున్న స్థానికులు
- బాబు- వైఎస్సార్‌సీపీ పాలన మధ్య బేరీజు వేసుకుంటున్న ప్రజలు



పిల్లారిపట్టులో నూతనంగా నిర్మించిన పాలిటెక్నిక్ కళాశాల


నింద్రలో నిర్మాణంలో ఉన్న టెక్స్‌టైల్ ఎక్స్‌పోర్టు కంపెనీ

నగరి: ఆంధ్రప్రదేశ్ విభజన అనంతరం హామీలపై హామీలు గుప్పించి గద్దెనెక్కిన నారా చంద్రబాబు నాయుడు ఆ తర్వాత అభివృద్ధి ఊసే మరిచారు. అనుభవం ఉంది కదా అభివృద్ధి చేస్తాడని తలచిన ప్రజల కల కలగానే మిగిలింది. ఐదేళ్ల జమానాలో అంటే 2014–19 మధ్య రాష్ట్రంలో అభివృద్ధి అతలాకుతలమైంది. మాటల్లో తప్ప అభివృద్ధి చేతల్లో కనిపించలేదు. దీంతో నగరి నియోజకవర్గంలో అభివృద్ధి పడకేసింది. ఈ సంగతి అలా ఉంచితే.. విద్య, వైద్యరంగాలను పూర్తిగా గాలికొదిలేశారు. 600 హామీలు ఇచ్చి హంగామా చేసి ప్రజల చెవుల్లో పూలు పెట్టారు. నియోజకవర్గాల అభివృద్ధికి చిల్లిగవ్వ ఇవ్వలేదు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడం కొత్త రాష్ట్రం కొత్త ఊపిరి పోసుకుంది. నాలుగేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో ఒక్క నగరి నియోజకవర్గంలోనే రూ.300 కోట్ల మేర అభివృద్ధి పనులు జరిగాయి. పరిపాలనలో కొత్తశకం ప్రారంభమైంది. అభివృద్ధి పనులను గమనిస్తున్న ప్రజలు.. చంద్రబాబు జమానాకు, వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి మధ్య తేడాను బేరీజు వేసుకుంటున్నారు.

నాలుగేళ్లలో అభివృద్ధి..

మంత్రి ఆర్కేరోజా అభివృద్ధి అంటే ఎలా ఉంటుందో నియోజకవర్గ ప్రజలకు చూపించారు. నాలుగేళ్లలో నియోజకవర్గానికి నూతన హంగులను తీసుకొచ్చారు. ప్రజలు సూచించే సమస్యలపై అతివేగంగా స్పందించే ఎమ్మెల్యేగా పేరు గడించారు. నాలుగేళ్లలో జరిగిన అభివృద్ధి ఒక మారు పరిశీలిస్తే..

అభివృద్ధి పథంలో విద్యారంగం..

గత ప్రభుత్వ పాలనలో ఉనికి కోల్పోయిన విద్యారంగం కొత్త ఊపిరి పోసుకుంది. నాడు నేడు పథకంలో రెండు విడతలుగా నియోజకవర్గంలో 226 పాఠశాలలు, 3 కళాశాలలను నవీకరించి కార్పొరేట్ స్థాయికి మార్చడానికి రూ.54 కోట్లు ఖర్చు చేశారు. నగరి డిగ్రీ కళాశాలలో పీజీ కోర్సులు ప్రారంభించారు, పీహెచ్‌డీ నగరి కళాశాలలోనే చేసుకునే అవకాశం కల్పించారు. కొత్త సర్టిఫికెట్ కోర్సులను ప్రారంభించారు. పుత్తూరు పిల్లారిపట్టులో రూ.7కోట్లతో పాలిటెక్నిక్ కళాశాలను నిర్మించి ప్రారంభించారు. నింద్ర, విజయపురంలో నూతన జూనియర్ కళాశాలలను మంజూరుచేసి ప్రారంభించారు. నగరి డిగ్రీ కళాశాల న్యాక్‌లో ఏ ప్లస్ సాధించేలా సహకారం అందించారు. ఎన్నడూ లేనివిధంగా విద్యారంగానికి పెద్దపీట వేశారు.

వైద్య రంగానికి పెద్దపీట..

టీడీపీ జమానాలో నిర్లక్ష్యానికి గురైన వైద్యరంగానికి జగనన్న ప్రభుత్వం జీవం పోసింది. నగరి ఏరియా ఆస్పత్రి రూ. 5 కోట్లతో నవీకరిస్తున్నారు. డయాలసిస్ సెంటర్‌కు ప్రస్తుతం నిర్మాణ పనులు జరుగుతున్నాయి. రెండు ఆక్సిజన్ ప్లాంట్లు ఏర్పాటుచేసి ఆక్సిజన్ అందించే వార్డులు సిద్ధం చేశారు. రూ.3.2 కోట్లతో నగరి, పుత్తూరులో 4 అర్బన్ హెల్త్ సెంటర్లు నిర్మించగా రెండు ప్రారంభమయ్యాయి. మరో రెండు నిర్మాణ పనులు దాదాపు పూర్తి చేసుకుని ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నాయి. నియోజకవర్గంలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను నవీకరించారు. నగరి ఏరియా ఆస్పత్రికి, బుగ్గ అగ్రహారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి దీర్ఘకాలికంగా ఉన్న రోడ్డు సమస్య పరిష్కారమై నూతన రోడ్డు, లైట్లు వేశారు.

తాగు, సాగు నీరు పుష్కలం..

నియోజకగవర్గ ప్రజలకు తాగు, సాగు నీరు అందించడానికి దీర్ఘకాళిక ప్రణాళికకు మంత్రి ఆర్కేరోజా శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా నగరి మండలం మొక్కల చేను కండ్రిగ వద్ద రూ.7 కోట్లు వ్యయంతో ప్రాజెక్టు మంజూరు చేయగా సంబంధిత పనులు జరుగుతున్నాయి. నగరి మున్సిపల్ పరిధిలో తాగునీరు అందించేందుకు రూ.15 కోట్లు మంజూరైంది. పుత్తూరులో ఆసియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు (ఏఐఐబీ) ద్వారా శాశ్వత మంచినటి పథకానికి రూ.139 కోట్లు మంజూరైంది. నియోజవర్గానికి 100 తాగు నీటి ట్యాంకులు మంజూరు కాగా త్వరలో ప్రారంభం కానున్నాయి. పుత్తూరులో యుద్ధప్రాతిపదికన ట్యాంక్‌బండ్‌ను తాత్కాలికంగా పటిష్టపరిచారు. ప్రస్తుతం ట్యాంక్‌బండ్ పక్కాగా నిర్మించడానికి రూ. 9 కోట్లు మంజూరు చేశారు.

దేవాలయాలకు మహర్దశ..

నియోజకవర్గంలోని దేవాలయాలకు ప్రస్తుత పాలన సువర్ణయుగంగా మారింది. నగరిలోని దేశమ్మ దేవాలయం రూ.1.20 కోట్లతో పునర్నిర్మిస్తున్నారు. పుత్తూరులో రూ.25 లక్షల వ్యయంతో ద్రౌపదమ్మ ఆలయ రాజగోపురం నిర్మించగా, రూ.25 లక్షల వ్యయంతో శివాలయం కోనేరు నిర్మాణం జరుగుతోంది. ముడిపల్లి కాలనీలో రూ.10 లక్షలు మంజూరు చేయించి శ్రీకృష్ణ ఆలయాన్ని నిర్మిస్తున్నారు. నింద్రలో వేంకటేశ్వర ఆలయ నవీకరణకు రూ.1.70 కోట్లు మంజూరు చేయించారు. బుగ్గఅగ్రహారంలో వన్నూరమ్మ దేవాలయాన్ని దేవాదాయశాఖ పరిధిలోకి తీసుకొచ్చారు. విజయపురం ఎస్టీ కాలనీలో రూ.10 లక్షల వ్యయంతో ఆలయ నిర్మాణం చేపట్టారు.


నగరిలో నిర్మాణంలో ఉన్న గ్రామదేవత దేశమ్మ ఆలయం


పుత్తూరులో ఏర్పాటుచేసిన పార్కు

కమనీయం..కమనీయం

నియోజకవర్గ ప్రజలు తక్కువ వ్యయంతో పెళ్లిళ్లు చేసుకునేందుకు మంత్రి ఆర్కే రోజా ప్రత్యేక చొరవ చూపారు. అప్పలాయ గుంటలో రూ.7 కోట్లతో కల్యామండపం నిర్మించారు. పుత్తూరులో టీటీడీ కల్యాణ మండపం నవీకరించారు. రూ.1.85 కోట్లతో పుత్తూరులో షాదీ మహల్ నిర్మాణంలో ఉంది.

ఉద్యోగాల కల్పనకు..

విజయపురం మండలం కోసల నగరం, నగరి మండలం వీకేఆర్‌పురం వద్ద ఇండస్ట్రియల్ పార్కు ఏర్పడనుంది. ల్యాండ్ అక్విజేషన్ పూర్తయి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పనులు జరుగుతున్నాయి. ఈ కారణంగా ఎంతోమందికి ఉద్యోగాలు రానుంది. నింద్ర మండలం ఎంఎస్‌వీఎం పురం గ్రామంలో టెక్స్‌టైల్స్ ఎక్స్‌పోర్టు కంపెనీని అనుమతులు ఇవ్వడంతో పనులు పూర్తయ్యాయి. దీని ద్వారా వేల సంఖ్యలో మహిళలకు ఉపాధి లభించనుంది.

ప్రమాణాలు పెంచే దిశగా..

ప్రస్తుత పాలనలో నియోజకవర్గ ప్రమాణాలు పెరిగాయి. మంత్రి ఆర్కేరోజా కృషితో నగరి డివిజన్‌గా మారింది. దీంతో నగరి పట్టణంలో నూతన ఆర్డీఓ కార్యాలయం, డీఎస్పీ కార్యాలయం వచ్చాయి. పుత్తూరు సర్కిల్ రద్దయినా మళ్లీ సర్కిల్ చేసి రూ. కోటి వ్యయంతో డీఎస్పీ కార్యాలయం, రూ. 1.10 కోట్లతో మున్సిపల్ పార్కు ఏర్పాటు చేయగా, నగరిలో మున్సిపల్ పార్కు నిర్మాణ దశలో ఉంది. నగరి, పుత్తూరులో మున్సిపల్ కార్యాలయాలకు రూ.2 కోట్లు చొప్పున మంజూరుకాగా పుత్తూరులో కార్యాలయ నిర్మాణం దాదాపు పూర్తయింది. పుత్తూరులో రూ.1.10 కోట్లతో ఆధునిక శ్మశాన వాటిక ఏర్పాటు చేశారు. నగరిలో తొలుత మంజూరై రూ. 35 లక్షల నిధులతో త్వరలో పనులు జరగనున్నాయి. వీటితో పాటు సచివాలయానికి రూ. 40 లక్షలు, సబ్‌సెంటర్లకు రూ.17.5 లక్షలు, రైతు భరోసా కేంద్రాలకు రూ.23 లక్షలు, పాలకేంద్రాలకు రూ.14 లక్షలు చొప్పున ఒక్కో సచివాలయ పరిధిలో రూ. కోటి మంజూరు చేసి భవనాలు నిర్మిస్తున్నారు. వీటిలో పలు భవనాలు ప్రారంభమై నిర్వహణలో ఉన్నాయి. నగరి, ఏకాంబరకుప్పం, పుత్తూరు రైల్వే స్టేషన్లు అత్యాధునిక హంగులను సంతరించుకున్నాయి. ఇదిగాక పలు ప్రాంతాల్లో సిమెంటు రోడ్లు, కల్వర్టులు, మురుగునీటి కాలువలు ఏర్పాటయ్యాయి.

నేత కార్మికులకు అండగా..

నియోజకవర్గంలోని నేత సామాజిక వర్గం వారికి కోవిడ్ సమయంలో ప్రభుత్వ యూనిఫామ్ ఆర్డర్లు ఇప్పించి పనికల్పించారు. పట్టు చీరల తయారీ, ఆధునిక యంత్రాల వాడే విధానాలపైనా శిక్షణ అందించారు. నిరుపయోగంగా ఉన్న ఈటీపీ ప్లాంటును వినియోగంలోకి తెచ్చారు.

రోజా చారిటబుల్ ట్రస్టు ద్వారా ఎనలేని సేవలు..

రోజా చారిటబుల్ ట్రస్టు ద్వారా గత నాలుగేళ్లలో ప్రజలకు ఎనలేని సేవలు అందించారు. కోవిడ్ సమయంలో టీడీపీ నాయకుల్లా ముఖం చాటేయక మంత్రి ఆర్కేరోజా ప్రతి వార్డులో తిరుగుతూ ప్రజలకు అవసరమైన కాయగూరలు, నిత్యావసర సరకులు అందించారు. ఆస్పత్రులన్నింటికీ సరిపడా మందులను సరఫరా చేశారు. ప్రతి బుధవారం నగరి, పుత్తూరు ఏరియా ఆస్పత్రులకు వచ్చే గర్భిణులు 500 మందికి పౌష్టికాహారాన్ని అందిస్తున్నారు. నిరాశ్రయులకు, ఆలయ నిర్మాణాలకు, క్రీడాభివృద్ధికి, మహిళాభివృద్ధికి, పండుగలకు అంటూ ఇప్పటికే కోట్లు వెచ్చించి సేవలు అందించారు.

క్రీడాభివృద్ధికి చేయూత..

గత నాలుగేళ్ల పాలన క్రీడాకారులకు వరంగా మారింది. కేవీకే క్రీడాప్రాంగణం నూతన హంగులు సంతరించుకుంది. శిక్షణకు, వ్యాయామానికి అవసరమైన అన్ని పరికరాలు, సామగ్రి క్రీడాకారులకు అందుబాటులోకి వచ్చింది. సమ్మర్ క్యాంప్‌లు నిర్వహిస్తూ విద్యార్థులకు క్రీడల్లో శిక్షణ అందిస్తూ టోర్నమెంట్‌లు జరుపుతున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయి పోటీలు నగరి క్రీడామైదానంలో జరుగుతున్నాయి. ఈ కారణంగా నియోజకవర్గానికి చెందిన పలువురు క్రీడాకారులు జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరుస్తున్నారు.

సాగులో విత్తనశుద్ధి కీలకం

పంటల సాగులో విత్తనశుద్ధి కీలకం. తగిన జాగ్రత్తలతో విత్తనశుద్ధి చేసి, చీడపీడలు, తెగుళ్లను నివారించగలిగితే అధిక దిగుబడులు సాధించవచ్చునని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. ఈ దిశగా ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే విత్తనశుద్ధిపై రైతులకు అవగాహన కల్పించడానికి అధికారులు సమాయత్తం అవుతున్నారు. ఇందుకు పుత్తూరు వ్యవసాయ డివిజన్ పరిధిలోని పుత్తూరు, వడమాలపేట, రామచంద్రాపురం, నారాయణవనం మండలాల్లో పొలంబడి కార్యక్రమాలు త్వరలో ప్రారంభం కానున్నాయి.

- చీడ పీడలు, తెగుళ్ల నివారణ సాధ్యం
- తక్కువ ఖర్చుతో పంటకు రక్షణ
- విత్తనశుద్ధితో అధిక దిగుబడులు
- పొలంబడికి సిద్ధమవుతున్న అధికారులు


వేరుశనగ విత్తనశుద్ధిపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు (ఫైల్)

పుత్తూరు రూరల్: పుత్తూరు వ్యవసాయ డివిజన్ పరిధిలో ఖరీఫ్ సీజన్‌లో 5 వేల హెక్టార్లలో వరి, వేరుశనగ, చెరకు, సజ్జ వంటి పంటలు సాగవుతున్నాయి. రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వం రైతులకు విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, వ్యవసాయ పనిముట్లు సబ్సిడీపై అందజేస్తోంది. విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్స్ ద్వారా పొలంబడి కార్యక్రమాలు నిర్వహిస్తూ ఎప్పటికప్పుడు సూచనలు, సలహాలను అందిస్తోంది. దీంతో రైతులు పంటల సాగుకు ఉత్సాహంగా ముందుకొస్తున్నారు. ఖరీఫ్ సీజన్‌లో ప్రధానంగా వేరుశనగ సాగుకు ముందు రైతులకు విత్తనశుద్ధిపై అవగాహన కల్పిస్తున్నారు. విత్తనశుద్ధి చేయడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చునని వ్యవసాయ అధికారులు తెలియజేస్తున్నారు.

వేరుశనగ విత్తనశుద్ధి ఇలా..

- ఒక కేజీ వేరుశనగ విత్తనానికి 3 గ్రాముల బావిస్టన్ లేక ఎం.45 లేదా సాఫ్‌పాడి కలిపి విత్తనశుద్ధి చేయాలి. ఫలితంగా మొలకలు బాగా పెరిగి తెగుళ్ల రాకుండా నివారించబడతాయి.
- విత్తనశుద్ధి వ్యవసాయ అధికారుల సూచనల మేరకు తగిన మోతాదులో మాత్రమే చేపట్టాలి. మోతాదు మించితే విత్తనం మొలకెత్తక నాశనం అవుతుంది.
- విత్తన సాగు తర్వాత 25 నుంచి 35 రోజుల్లోపు ఆకుపచ్చ తెగులు సోకకుండా కాంటఫ్ మందును స్ప్రే చేయాలి.
- 90 రోజుల తర్వాత బావిస్టన్‌ను స్ప్రే చేస్తే ఆకు దృఢంగా ఏర్పడి మంచి దిగుబడి వచ్చే అవకాశం ఉంది.
- విత్తనశుద్ధి చేసేటప్పుడు రైతులు ముఖానికి మాస్కులు, చేతులకు గ్లౌజ్‌లు విధిగా వినియోగించాలి.

పుత్తూరు డివిజన్‌లో పొలంబడి వివరాలు

మండలం పేరు	వరి విత్తనశుద్ధి	వేరుశనగ విత్తనశుద్ధి
పుత్తూరు	5	0
వడమాలపేట	1	2
రామచంద్రాపురం	4	1
నారాయణవనం	3	1
మొత్తం	13	4

విత్తనశుద్ధి విధిగా చేయండి..



పుత్తూరు వ్యవసాయ డివిజన్ పరిధిలో 13 ఆర్బీకేలలో వరి, 4 ఆర్బీకేల పరిధిలో వేరుశనగ విత్తనశుద్ధిపై రైతులకు అవగాహన కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయి. వ్యవసాయ అధికారుల సూచనలు పాటించి, అధిక దిగుబడులు సాధించండి. పంట సాగుకు ముందు విత్తన శుద్ధి ఎంతో ఉపయోగకరం. ఏపంటకైనా మోతాదుకు మించి ఎరువులు, మందులు వాడకూడదు. రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి, సేంద్రియ ఎరువుల వాడకాన్ని పెంచాలి. త్వరలో ప్రారంభం కానున్న పొలంబడి కార్యక్రమంలో పాల్గొని, సాగులో సలహాలు, సూచనలు పొందండి. వేరుశనగ విత్తనశుద్ధి విధిగా చేయండి. – ఆర్.రమేష్‌రాజు,అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చరల్, పుత్తూరు

అంతఃకరణశుద్ధితో..

- పాతికేళ్ల రెగ్యులరైజ్ నిరీక్షణకు తెర
- జీపీఎస్‌పై సర్వత్రా హర్షాతిరేకలు

పుత్తూరు రూరల్: పాదయాత్ర, ఎన్నికల హామీలు అన్నింటినీ అంతఃకరణశుద్ధితో అమలు చేసిన ఒకే ఒక్కడుగా, రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్ర సృష్టించారని పలు ప్రభుత్వ ఉద్యోగ సంఘాల నేతలు కీర్తిస్తున్నారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) ఉద్యోగులకు గ్యారెంటీ పెన్షన్ స్కీమ్ (జీపీఎస్) తీసుకురావడం పట్ల ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 10 వేల మంది కాంట్రాక్టు ఉద్యోగాల క్రమబద్ధీకరణ పట్ల ఉద్యోగులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

భవిష్యత్‌పై నమ్మకం కల్పించారు..



సీపీఎస్ స్థానంలో జీపీఎస్ తీసుకొచ్చి భవిష్యత్‌పై నమ్మకం కల్పించారు. 12వ పే రివిజన్ కమిషన్ ఏర్పాటుతో పాటు 10 వేల మంది కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ హర్షణీయం. కేబినెట్ నిర్ణయాల పట్ల ఉద్యోగుల్లో, రిటైర్డ్ ఉద్యోగుల్లోనూ సానుకూలత ఏర్పడింది. భవిష్యత్‌లో సీఎం మరిన్ని మంచి నిర్ణయాలు చేస్తారని ఆశిస్తున్నాం.
– బి.భాస్కర్‌రాజు, అధ్యక్షుడు, ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం, పుత్తూరు

పాతికేళ్ల నిరీక్షణకు తెర..



కాంట్రాక్టు ఉద్యోగుల పాతికేళ్ల నిరీక్షణకు తెరపడినట్లే. ప్రభుత్వం ఉద్యోగుల ఇంట సంతోషాల వెలుగులు పూయించింది. సీపీఎస్ స్థానంలో జీపీఎస్‌తో ఉద్యోగుల్లో సానుకూలత ఏర్పడింది. మిగిలిన అన్ని సమస్యలను దశల వారీగా పరిష్కరించాలని కోరుతున్నాను.
– కె.శివయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఏపీ ఆరోగ్య విస్తరణాధికారుల సంఘం, పుత్తూరు

సీఎంకు ధన్యవాదాలు..



ప్రస్తుత పరిస్థితుల్లో ఉద్యోగులకు చేయూత నివ్వాలనే సదుద్దేశంతో జీపీఎస్ తీసుకురావడం పట్ల సంతోషంగా ఉన్నాం. కొత్త పీఆర్సీ ఏర్పాటు, హెచ్‌ఆర్‌ఏ 12 నుంచి 16 శాతానికి పెంచడం వల్ల ఉద్యోగులకు మేలు చేకూరుతోంది. సీఎం ఉద్యోగుల పట్ల సానుకూల నిర్ణయాలు తీసుకోవడం మంచి పరిణామం. ప్రభుత్వ ఉద్యోగుల సంఘం తరపున సీఎంకు ధన్యవాదాలు తెలుపుకొంటున్నాను. – రవికుమార్, అధ్యక్షుడు, ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం, పుత్తూరు తాలూకా యూనిట్

రికార్డులను తొలగించండి


పాత తహసీల్దార్ భవనంలోని రికార్డులను పరిశీలిస్తున్న కమిషనర్

పుత్తూరు రూరల్: పాత భవనాల్లోని రికార్డులను తొలగించాలంటూ తహసీల్దార్, ఎస్టీఓలను లిఖిత పూర్వకంగా కోరినట్లు మున్సిపల్ కమిషనర్ కేఎల్‌ఎన్ రెడ్డి తెలిపారు. గురువారం కమిషనర్ ఎస్టీఓ భవనం వెనక భాగంలో నూతనంగా నిర్మిస్తున్న మున్సిపల్ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ మున్సిపల్ భవనం ప్రారంభోత్సవానికి అనువుగా ముందు భాగంలో శిథిలావస్థలో ఉన్న తహసీల్దార్, ట్రెజరీ భవనాలను తొలగించాలని ఆయా శాఖలను కోరినట్లు చెప్పారు. పాత తహసీల్దార్ భవనంలో పాత రికార్డులన్నీ అలానే ఉన్నాయని, వాటిని కొత్త భవనంలోకి మార్చాలని సూచించినట్లు తెలిపారు. అనంతరం ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న శివాలయం పార్కింగ్ స్థలాన్ని పరిశీలించారు. అక్కడ మెప్మా ఆధ్వర్యంలో అర్బన్ మార్ట్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. స్థానిక ధర్మరాజులస్వామి ఆలయ పరిసరాల్లో ఉన్న షాపు యజమానులు చెత్తను రోడ్డుపై వేయడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. దుకాణదారులు డస్ట్ బిన్స్‌ను ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు.

పేద పిల్లల చదువులకు పెద్దపీట


జేవీకే కిట్ వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ లత

కార్వేటినగరం: పేద పిల్లల చదువులకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎంపీపీ లత అన్నారు. గురువారం జిల్లా విద్యాశిక్షణ సంస్థ (డైట్)లో జగనన్న విద్యాకానుక రథాన్ని ప్రారంభించారు. ఎంపీపీ మాట్లాడుతూ విద్యాభ్యాసంలో పేద, ధనిక తేడా లేకండా ప్రతిఒక్కరూ ప్రభుత్వ బడుల్లో విద్యనభ్యసించే విధంగా కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా 1 నుంచి పదో తరగతి వరకు జగనన్న విద్యాకానుకలో భాగంగా టెక్స్ట్‌బుక్స్, నోటు పుస్తకాలు, మూడు జతల యూనిఫాం, రెండు జతల బూట్లు, సాక్స్‌లు, స్కూల్ బ్యాగ్, బెల్ట్‌తో పాటు డిక్షనరీ అందించి విద్యకు ప్రాధాన్యత కల్పించింది జగనన్న ప్రభుత్వమేనని అన్నారు. తల్లిదండ్రులు ప్రతిఒక్కరూ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమాలను అందుకోవాలన్నారు. ఎంపీడీఓ మోహన్‌మురళి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల మౌలిక వసతులతో పాటు ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టిందన్నారు. అనంతరం డైట్ మోడల్ పాఠశాలలో ఏర్పాటు చేసిన జగనన్న విద్యాకానుక ప్రదర్శనను ఎంపీపీ పరిశీలించారు. ఆదేవిధంగా జేవీకే సరఫరా వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, మండల కోఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్‌రెడ్డి, సర్పంచ్ శేఖర్‌రెడ్డి, ఎస్ఎస్ఏ ఏఈ నాగభూషణం, హెచ్‌ఎం లలిత, ఎంఐఎస్ కోఆర్డినేటర్ రేఖ, సుధాకర్, సీఆర్పీ గణేష్, రవిరెడ్డి, రాజారెడ్డి, మురగయ్య పాల్గొన్నారు.

వైభవంగా గంగమ్మ జాతర

నింద్ర: మండలంలోని మిట్టకండ్రిగ, కర్వరవేడు గ్రామంలో గురువారం గంగమ్మ జాతర వైభవంగా జరిగింది. బుధవారం రాత్రి ప్రత్యేకంగా తయారు చేసిన గంగమ్మను గ్రామంలో ఊరేగించారు. అనంతరం గంగమ్మను ప్రతిష్టించారు. గురువారం ఉదయం అమ్మవారికి అంబలి పోశారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

చక్రస్నానం..భక్తజన పరవశం

నారాయణవనం: పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో చివరి రోజైన గురువారం పద్మ సరస్సులో చక్రతాళ్వార్‌తో కలిసి భక్తులు పవిత్ర స్నానాలు ఆచరించారు. సాయంత్రం ధ్వజావరోహణంతో ఉత్సవాలు పరిసమాప్తమయ్యాయి. వేకువ జామున అర్చకులు శ్రీవారి పల్లకీ సేవను మాడ వీధుల్లో నిర్వహించారు. అనంతరం శ్రీదేవీ, భూదేవీల సమేతుడైన వేంకటేశ్వరుడు ఊరేగింపుగా పద్మ సరస్సుకు చేరుకున్నారు. వేదమంత్రాలు, మంగళవాయిద్యాల మధ్య అర్చకులు చక్రతాళ్వార్‌తో కలిసి దేవేరులకు తిరుమంజనం పూర్తి చేశారు. 11.10 గంటలకు పద్మసరస్సులోని జలాలకు సంప్రోక్షణ కార్యక్రమాలను పూర్తి చేసిన అర్చకులు చక్రతాళ్వార్‌ను సరస్సులో మూడు మునకలు వేయించారు.